# ప్రజాశక్తి

ఆదివారం 18 ఆగస్టు 2024

## తలసేమియా బాధితులకు ఉచితంగా రక్తం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలోని తలసేమియా , సికిల్ సెల్ బాధితులకు రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ ద్వారా ఉచితంగా బ్లడ్ అందించనున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకంగా రక్తదాత (డోనర్) అవసరంలేదని, బాధితులు వారి బ్లడ్ గ్రూప్ తెలియజేసి రెడ్‌క్రాస్ సెంటర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది, ప్రజాసంఘాల నాయకులు

బొబ్బిలిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

# వైద్యురాలి హత్యపై వెల్లువెత్తిన నిరసనలు

- ఐఎంఎ ఆధ్వర్యాన వైద్యుల ర్యాలీ.. కలెక్టరేట్ వద్ద ధర్నా
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- ప్రజాసంఘాల ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కోల్‌కతాలోని ఆర్‌జికార్ వైద్య కళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ శనివారం ఐఎంఎ ఆధ్వర్యాన వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజాసంఘాల నాయకులు జిల్లా అంతటా నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బొబ్బిలి, విజయనగరంలో ప్రజాసంఘాల ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. విజయనగరంలో ఐఎంఎ హాలు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జెసి నాయుడు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డిశంకరరావు , ఐఎంఎ మహిళా నాయకులు డాక్టర్ సన్యాసమ్మ మాట్లాడుతూ మహిళా డాక్టర్‌పై సాముహిక ఆత్యా చారం, హత్య ఘటనను తీవ్రంగా ఖండించారు, ఆమె కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. దేశంలో డాక్టర్లపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నా యన్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్లపై భౌతిక దాడుల నివారణకు చట్టం తేవాలని డిమాండు చేశారు. తక్షణమే కోల్‌కతా అర్‌జి కార్ మెడికల్ కళాశాల మహిళా డాక్టరుపైజరిగిన ఆత్యాచారం, హత్య కేసులో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమల ప్రసాద్, ఐఎంఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్, కార్యదర్శి డాక్టర్ లెంక శ్రీనివాస్, జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజగోపాల్, మెడికల్ రిప్రజెంటేటివ్స్, యూనియన్ నాయకులు శ్రీను, భగా వాన్, మూర్తి ప్రజాసంఘాల నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

విజయనగరం ఎల్‌బిజి నగర్‌లో ఐద్వా ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ

**ఐద్వా ఆధ్వర్యాన కొవ్వొత్తుల ప్రదర్శన**

వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, సహాయ కార్యదర్శి వి. లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ఎల్‌బిజి నగర్, తోటపాలెం ముచ్చివాని చెరువుగట్టుపై కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఉత్తరాఖండ్ లో కూడా నర్స్ పై అత్యాచారం చేసి హత్య చేశారని, ఇలాంటి మానవ మృగాలను సమాజంలో తిరగకుండా కఠిన చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్స్‌లో రక్షణ సిబ్బందిని పెంచాలని, వైద్యులపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు ఎ. జగన్ మోహన్ రావు, జెవివి పట్టణ అధ్యక్షులు ఎల్ చిన్నారి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హరీష్, ఐద్వా నాయకులు డి.కరుణ, వెంకటమ్మ, కమలమ్మ, చిన్న, సీతమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు

**యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన కొవ్వొత్తులతో నిరసన**

**బొబ్బిలి :** ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా గాంధీ విగ్రహం వద్ద యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. నిందితులకు ఉరి శిక్ష వేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు మణికుమార్ డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కె.కృష్ణదాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతాం

- ఎస్ఎంఎస్ఇ శాఖా మంత్రి కొండపల్లి
- రాష్ట్రస్థాయి సీనియర్ మెన్, ఉమెన్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరాన్ని క్రీడా హబ్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక ఇండోర్ స్టేడియంలో సీనియర్ స్త్రీ,పురుష బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలను ఎమ్మెల్యేలు కళా వెంకటరావు, పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబుతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు క్రమశిక్షణ, పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులంతా పోటీ తత్వంతో ఆడి క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలన్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలో మూతపడిన క్రీడా పాఠశాలను తెరిపించే ప్రయత్నం చేస్తామన్నారు.

**నెల్లిమర్ల కు ఇండోర్ స్టేడియం మంజూరు చేయండి**

ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడకు రోజు రోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. నెల్లిమర్ల పట్టణంలో కూడా బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎక్కువ మందిఉన్నందున అక్కడ ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు కెవి నాయుడు, చైర్మన్ మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, కార్యదర్శి నున్నా సురేష్, డాక్టర్ వివిఎస్ ప్రసాద్, వై.కుసుమబచ్చన్ అసోసియేషన్ నాయకులు, 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

**ఉత్సాహంగా రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం**

తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలు శనివారం రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పి.రఘువర్మ, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తైక్వాండోకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. క్రీడాకారులంతా పోటీల్లో రాణించాలని కోరారు. ఎమ్మెల్సీ రఘువర్మ, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు మాట్లాడుతూ బాలికలు ఆత్మరక్షణతో పాటు క్రీడల్లో రాణించడం హర్షనీయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. ఈ పోటీల్లో బంగారుపతకాలు సాధించిన వారు సెప్టెంబర్ 7,8,9తేదీల్లో ఆగ్రాలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు.

## సుప్రీంకోర్టు న్యాయమూర్తిని కలిసిన జిల్లాజడ్జి, కలెక్టర్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జెకె మహేశ్వరిని, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ చక్రవర్తి, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కలిశారు. అరకు నుంచి విశాఖ వెళ్తున్న జస్టిస్ మహేశ్వరిని, ఎస్.కోట వద్ద మర్యాద పూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛాలు అందించారు. అడిషనల్ సబ్ జడ్జి పివి రాజేంద్రకుమార్, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి మీనాదేవి, ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎం.శ్రీనివాసరావు, ఎస్.కోట కోర్టు న్యాయమూర్తి ఎస్. వాణి, కొత్తవలస కోర్టు న్యాయమూర్తి విజయచందర్ కూడా పుష్ప గుచ్ఛాలు అందజేశారు విజయనగరం ఆర్‌డిఒ ఎం.వి. సూర్యకళ, డిఎస్‌పి గోవిందరావు, తహశీల్దార్ అరుణకుమారి పాల్గొన్నారు.

# క్వారీ పనులను వెంటనే నిలుపుదల చేయాలి

**రామచంద్రపేట క్వారీని పరిశీలించిన సిపిఎం నాయకులు**

ప్రజాశక్తి- భోగాపురం

రామచంద్రపేటలో విమానాశ్రయ నిర్మాణ సంస్థ జిఎంఆర్ సంస్థకు కేటాయించిన క్వారీ పనులను వెంటనే నిలుపదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూ ర్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం రామచంద్రపేట గ్రామాన్ని తమ్మినేనితో పాటు సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్, బచ్చల సూర్యనారాయణ సందర్శించారు. క్వారీ వల్ల గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై కరపత్రాన్ని గ్రామస్తులతో కలిసి విడుదల చేశారు. అనంతరం క్వారీని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పెద్దలు దుక్క అప్పన్న, రవణతో పాటు గ్రామస్తులు క్వారీ వలన పడుతున్న ఇబ్బందులను వివరించారు. రానున్న రోజుల్లో ఇక్కడ బాంబు పేలుళ్లు నిర్వహిస్తే ఇంకా ప్రమాదకరంగా ఉంటుందని తెలిపారు. క్వారీ ఉన్న వైపు ఎవరైనా వెళితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే ఉన్న క్వారీలతో గత కొన్నేళ్లు నుంచి ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పుడు గ్రామానికి ఆనుకొని మరో క్వారీని ఏర్పాటు చేయడం వలన ఇంకా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు.

తమ్మినేని మాట్లాడుతూ గ్రామానికి 250 మీటర్లు దూరం ఉన్న క్వారీకి సమీపంలోనే పాఠశాల ఉందని, ప్రజలను తీవ్ర ఇబ్బందుల పెట్టేందుకే ఇక్కడ క్వారీ ఏర్పాటు చేశారని అన్నారు. జిల్లాలో చాలాచోట్ల క్వారీలు ఉండగా ఇక్కడే మంజూరు చేయడం దారుణమన్నారు. క్వారీలో జరిగే పేలుళ్ళకు గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారని అన్నారు. పేలుడు ధాటికి ఇంటి పెచ్చులు కూడా రాలిపోతున్నాయని అన్నారు. తాగునీరు కలుషితమై కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని అన్నారు. గొర్రెలు, మేకలు, పశువులు మేసేందుకు వెళ్లే చోట మంజూరు చేయడం సరికాదని అన్నారు. వెంటనే ఇక్కడ క్వారీ పనులు నిలిపివేయాలని తెలిపారు. వచ్చే సోమవారం గ్రామస్తులందరితో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని తెలిపారు.

క్వారీ వద్ద సిపిఎం నాయకులకు సమస్యను వివరిస్తున్న గ్రామస్తుడు

## దేశవాళీ వరి రకాలతో అధిక లాభాలు

ప్రజాశక్తి - గజపతినగరం

దేశవాళీ వరి రకాలతో అధిక లాభాలు వచ్చే అవకాశం పుష్కలంగా ఉందని వ్యవసాయశాఖ ఎడి మహారాజన్ అన్నారు. శనివారం మండలంలోని పిఎస్ఆర్ పురంలో ఆయనతోపాటు ఆర్బిఎల్ ప్రకాష్, ఆర్‌టిఒ హేమ సుందర్, ఎంఎఒ సిహెచ్.ధనలక్ష్మి తదితరులు రైతు రమణమూర్తి పంతులు పొలంలో దేశవాళీ వరి రకాన్ని పరిశీలించారు. ఫీల్డ్ ఈక్రాప్ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్మినెంట్ సిమెంట్ ఫిట్ లో దశపర్ని కషాయం తయారు చేయించడంతో పాటు అన్ని రకాల పురుగులకు ,తెగుళ్లకు, గ్రోత్ ప్రమోటర్‌గా సమర్థవంతంగా ఇది పని చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో విఎఎ వినయ్, మస్తాన్, రైతులు పాల్గొన్నారు.

## తాటిపూడి రిజర్వాయర్‌కు గొర్రిపాటి పేరు కొనసాగించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తాటిపూడి రిజర్వాయర్‌కు స్వాతంత్ర సమరయోధులు, గొర్రిపాటి బుచ్చప్పారావు పేరును కొనసాగించాలని కొప్పల వెలమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కామాక్షి నగర్‌లోగల కొప్పల వెలమ సంక్షేమ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిలపర్తి పరదేశి నాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు గొర్రిపాటి బుచ్చప్పారావు పేరును గతంలో తాటిపూడి రిజర్వాయర్‌కు పెట్టారని,ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీవో కూడా జారీ చేసిందని అన్నారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం ఆ జీవోను రద్దుచేసి కొత్త జీవో విడుదల చేసిందని దాని ప్రకారం బుచ్చప్పారావు పేరు తొలగించినట్లుగా తాము భావిస్తున్నామని అన్నారు. బుచ్చప్పారావు హయాంలో తాటిపూడి రిజర్వాయర్ కోసం ఊరూరా తిరిగి కార్పస్ నిధులు సేకరించి రిజర్వాయర్ నిర్మాణానికి ఆయన ఎనలేని కృషి సాగించారన్నారు. దాని ఫలితంగా తాటిపూడి రిజర్వాయర్ ఏర్పాటై తాగునీరు, సాగునీరు అందుతుందని అన్నారు. అనంతరం రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాసరావుకు వినతి ఇవ్వగా, ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కొప్పల వెలమ సంక్షేమ సంఘ భవనం అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు, జిల్లా అధ్యక్షుడు బొత్స వరప్రసాద్, అర్బన్ అధ్యక్షుడు యాండ్రాపు తాతబాబు, దొగ్గ దేవుడు, కరక గోపాలరావు, ఎస్ వి వి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీవన ప్రమాణాలు పెంచేలా ప్రణాళికలు

**సెప్టెంబర్ 1 నాటికి యాక్షన్ ప్లాన్ సమర్పించాలి : కలెక్టర్**

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఉపాధి అవకాశాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి తద్వారా జిల్లా అభివృద్ధి జరిగేలా అన్ని శాఖలూ ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళికలు ఉండాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. వచ్చే ఐదేళ్లు మీరిచ్చే ప్రణాళికల ఆధారంగానే పని చేయవలసి ఉంటుందని, అన్ని శాఖలు వారి లక్ష్యాలను, కార్యక్రమాల వారీగా సామజిక , ఆర్థిక సూచీలను అంచనా వేసి ప్రణాళికలు సమర్పించాలని తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం వికసిత్ ఆంధ్ర 2047 లో భాగంగా వచ్చే ఐదేళ్ల (2024 -29) కార్యాచరణ ప్రణాళిక పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక అంశాలే కాకుండా అనేక ఆర్థికేతర కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయని, వాటి పై ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను నూటికి నూరు శాతం మొదట పూర్తి చేయాలన్నారు. జిల్లా అభివృద్ధికి ఉపయోగపడే పనులను విజన్ డాక్యుమెంట్ లో రూపొందించాలని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్‌బిఆర్ అంబేద్కర్

ప్రణాళికలు వేసేటప్పుడు ముఖ్యంగా శాఖల మధ్య సమన్వయం ఉండాలని, గడువు లోగా ఉపయుక్తమైన ప్రణాళికలు పంపాలని తెలిపారు. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ వాస్తవంగా చేయగలిగే పనులను మాత్రమే లక్ష్యాలలో చేర్చాలని, గ్రామా స్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రణాళికలో ఉండాలని తెలిపారు. సిపిఒ బాలాజీ మాట్లాడుతూ లక్ష్యాల వారీగా ప్రణాళిక లు తయారు చేసి సెప్టెంబర్ 1 లోగా పంపాలన్నారు. ఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి , ఉద్యానశాఖ డిడి జమదగ్ని , అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు మృతదేహం లభ్యం

**పాచిపెంట :** కొండవాగుగెడ్డ వాగులో కొట్టుకుపోయిన ఉపాధ్యాయుడు మహేష్ మృతదేహం శనివారం ఉదయం వాగుకు కొంత దూరంలో లభ్యమైంది. శుక్రవారం సాయంత్రం కొటికిపెంట ఏకలవ్య ఆశ్రమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఆర్తి (26), వార్డెన్ మహేష్ (31) కొండవాగులో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. పోలీసు, రెవెన్యూ సిబ్బంది గాలింపు చర్యలతో అదే రోజు రాత్రి ఆర్తి మృతదేహం లభ్యమైంది. శనివారం విశాఖపట్నం ఎస్‌డిఆర్ఎఫ్ బృందం, స్థానిక రెవిన్యూ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టడంతో వార్డెన్ మహేష్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని సాలూరు సిహెచ్‌సికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

# బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం టిడిపి

**కిమిడి నాగార్జున**

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి పేద బడుగు బలహీన వర్గాల ప్రభుత్వమని విజయనగరం పార్లమెంటు అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. శనివారం నగరంలోని అన్న క్యాంటీన్లను సందర్శించి భోజనాలు వడ్డించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అన్న క్యాంటీన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల ఆకలి తీరాలని సదుద్దేశంతో ప్రారంభించారని తెలిపారు. ఐదు రూపాయలకే భోజనం అందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎంతోమంది పేదల ఆకలి తీర్చిన డొక్కా సీతమ్మ పేరు మీద పునః ప్రారంభించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

భోజనం చేస్తున్న టిడిపి నాయకులు నాగార్జున

## కుళాయి కనెక్షన్లపై ఇంటింటి సర్వే : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్న ఉద్దేశంతో ఇంటింటి సర్వే చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు తెలిపారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ కుళాయి కనెక్షన్లు కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. వారంతా నగరంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఏ ఇంటికి కుళాయి ఉందో, ఎక్కడ లేదో వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. మొత్తంగా నగరంలో ఉన్న కుళాయిలు ఎన్ని, లేనివి ఎన్ని, అనే నివేదికను రూపొందిస్తారన్నారు. ఇంటి కొళాయిని ఎంతమంది వినియోగించుకుంటున్నారన్న వివరాలను సేకరిస్తారన్నారు. ఇందుకోసం ప్రతి ఇంటికి వచ్చే తమ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సర్వే వల్ల భవిష్యత్తులో కొళాయి కనెక్షన్లు అవసరమైన వారికి కూడా ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

## సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-విజయనగరం కోట

సమాజం లో జర్నలిస్టుల పాత్ర కీలకమని రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస రావు అన్నారు. ఎపియూడబ్ల్యుజె 67వ ఆవిర్భావ దినోత్సవం ఐఎం ఎ హాలులో శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుతో పాటు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు అదితి విజయలక్ష్మి, కళా వెంకటరావు, లోక మాధవి, తోయక జగదీశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళతామన్నారు. మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ పాలకులు, ప్రజాప్రతినిధులు జర్నలిస్టుల కోసం నిరంతరం పని చేసే విధంగా సంఘం చొరవ తీసుకోవాలని సూచించారు. ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేస్తున్నామన్నారు. జర్నలిస్టుల పై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, చత్తీస్‌ఘడ్ లో తెచ్చిన రక్షణ చట్టం దేశ వ్యాప్తంగా అమలు చేయాలని, జర్నలిస్టుల సంక్షేమానికి తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతకుముందు అంబటిసత్రం వద్దగల సర్ సివై చింతామణి విగ్రహానికి స్త్రీశిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమాచారశాఖ ఎడి డి.రమేష్, యూనియన్ నాయకులు పిఎస్ఎస్‌వి ప్రసాద్, మహాపాత్రో, రాధాకృష్ణ, పంచాది అప్పారావు ఎం ఎస్ ఎన్ రాజు, రాధాకృష్ణ, మహాపాత్రో, పంచాది అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌జైళ్ల సందర్శన

**చీపురుపల్లి :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకల్యాణి చీపురుపల్లి,విజయనగరం సబ్‌జైళ్లను శనివారం సందర్శించారు. వాటిలో కొనసాగుతున్న జైలులీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. న్యాయవాదులు మరియు పారా లీగల్ వాలంటీర్లు నిర్వహిస్తున్న విధులను గురించి ఆరా తీశారు జైలులో ఉన్న ముద్దాయిలకు సకాలంలో న్యాయసహాయం అందించడానికి జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు.

# భూ సమస్యల పరిష్కారం మొక్కుబడి కారాదు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సగటు మనిషి లేదా కుటుంబ జీవితం భూమితో ముడిపడి ఉంటుంది. ఇంకా చెప్పాలంటే రెవెన్యూ అధికారుల పెన్ను మొన కూడా పొరపాటున పడితే సంబంధిత కుటుంబ ఆర్థిక స్థితిగతులు పూర్తిగా తారుమారవుతాయి. ఇటువంటి తపొప్పులకు గ్రామాల్లో పనిచేసే విఆర్ఒ చాలు. కానీ, ఆయా తప్పులను సరిచేయాలంటే నేటి రెవెన్యూశాఖ పనితీరును బట్టి సగటు మనిషి జీవిత కాలం కూడా సరిపోని పరిస్థితి దాపురిస్తోంది. బహుశా అందుకే ఇతర సమస్యలతో పోల్చుకున్నప్పుడు భూ సమస్యలపై ఎక్కువగా వినతులు వస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం భూదాహానికి బరితెగించిన సందర్భాలు అనేకం. మరో అడుగు ముందుకు వేస్తే దళితులు, కొందరు బిసిల అభ్యున్నతికి పూర్వం ఇచ్చిన అసైన్డ్ భూములను సైతం ఎంతో మంది పెత్తందారులు, రాజకీయ నాయకులు వశపర్చుకుంటునే ఉన్నారు. ఎన్నో చట్టాలు ఉన్నా వాటిలో లొసుగులను తమకు అనుకూలంగా మార్చు కుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకించి రెవెన్యూ రికార్డుల పరిశీలన, భూ వివాదాలపై వినతుల స్వీకరణ కోసం ప్రత్యేకించి మన జిల్లాకు ఏకంగా రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా రావడం అభినందనీయమే. కానీ, రికార్డులను ప్రక్షాళన చేయడంతోపాటు భూ సమస్యలను పరిష్కరించేందుకే వచ్చానంటూ సిసోడియా చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారులు కూడా ఇదే విషయాన్ని నొక్కిచెప్తున్నారు. త్వరలో రెవెన్యూ సదస్సులు కూడా గ్రామ స్థాయిలో నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఈ నేపథ్యంలో భూ సమస్యలపై ప్రభుత్వం లోతుల్లోకి వెళ్లి పరిష్కారం




చూపుతుందా? లేక గత ప్రభుత్వంలో జరిగిన భూ కబ్జాలు, జగనన్న కాలనీలు తదితర పేర్లతో సేకరించిన భూమి కొనుగోలు, చెల్లింపులు వ్యవహారాలకే పరిమితమౌతుందా? అన్నది పబ్లిక్ టాక్. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరిట పనికి రాని భూములను రూ.కోట్లు చెల్లించి కొనుగోలు చేశారు. దీంతో, చాలాచోట్ల ఇళ్ల పట్టాలు తీసుకునేందుకు కూడా లబ్ధిదారులు ముందుకు రాలేదు. రాష్ట్రంలోనే అతి పెద్దదిగా గుర్తింపు పొందిన గుంకలాం లేఅవుట్ స్థలం కొనుగోలు మొదలుకుని, కేటాయింపుల వరకు అవినీతి జరిగిందని అప్పట్లో సాక్షాత్తు అధికార పార్టీ నాయకులే బహిరంగ చర్చకు తెరలేపారు. అటు పార్వతీపురం జిల్లా కేంద్రంలోని పేదలకు పెదమరికి కొండవాలు ప్రాంతంపై స్థలాలు ఇచ్చారు. వీటితోపాటు అనేక చోట్ల రూ.కోట్ల అవినీతి జరిగిందన్నది అప్పట్లో బహిరంగ చర్చ నడిచింది. మరోవైపు 20ఏళ్లకు మునుపు పొందిన అసైన్డ్ భూములను సంబంధిత దళితులు, ఇతర వెనుకబడిన తరగతుల పేదలకు రెగ్యులర్ చేస్తామంటూ గత ప్రభుత్వం జిఒ జారీచేసిన సంగతి తెలిసిందే. ఆచరణలో వాటిలో ఎక్కువ భాగం అప్పటి ప్రభుత్వంలోని అధికారులు, నాయకులే కొనుగోలు చేసినట్టు విమర్శలు వచ్చాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో కొన్ని దందాలు, అక్రమ కొనుగోళ్లు రెండు నెలల క్రితం ప్రజాశక్తి వెలుగులోకి తెచ్చిన సంగతి కూడా తెలిసిందే. ఇంకా లోతుల్లోకి వెళ్తే దళితుల పేరున ఉన్న అసైన్డ్ భూములను రికార్డుల్లో తారుమారు చేశారు. ఇటువంటివి మెంటాడ, వేపాడ మండలాల్లో కొకొల్లాలుగా ఉన్నాయి. గిరిజన ప్రాంతంలో పెత్తందారుల ఆక్రమణలకు అడ్డూ ఆపూ లేకుండా పోయింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, రాజకీయ జోక్యం, పార్టీల ప్రమేయం పక్కనబెట్టి ఈ భూ ఆక్రమాలన్నీ వెలికి తీయాలని, పేదలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జనం చర్చించు కుంటున్నారు. కేవలం గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపైనే చర్చ నడిస్తే అది కేవలం కక్ష సాధింపుగానే మిగిలిపోతుంది తప్ప, పేదలకు ఒరిగిందేమీ లేదని కూడా పబ్లిక్ టాక్.

## ఇ -పంట నమోదుపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించాలని తహశీల్దారు పేరుబండి సుదర్శనరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్ కోటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వ్యవసాయాధికారి ఎం.పూర్ణిమ అధ్యక్షతన ఈ పంటలు నమోదు ప్రక్రియపై గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రైతు సేవాకేంద్రం అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వేసిన ప్రతీ పంటను ఇ పంటలో నమోదు చేయాలన్నారు. ఇ పంటలో నమోదు చేసుకోవడం వల్ల రైతులకు పంటల బీమా, ధాన్యం కొనుగోలు, పంటల నష్ట పరిహారం, సున్నా వడ్డీ పంట రుణాలు, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సబ్సిడీ పథకాలు వర్తిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు, విఆర్ఒ, ఆర్ఎస్‌కె ఇంఛార్జులు పాల్గొన్నారు.

న్యాయవాదులతో మాట్లాడుతున్న జడ్జి వివేకానంద శ్రీనివాస్

## న్యాయమూర్తులతో సమావేశం

ప్రజాశక్తి - రాజాం

స్థానిక కోర్టు ఆవరణలో శనివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులతో జడ్జి సిహెచ్ వివేకానంద శ్రీనివాస్ వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 14న జరగబోయే లోక్ అదాలత్ కక్షిదారులకు ఒక మంచి అవకాశమని రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.వి.రామనాయుడు, ఎజిపి పోలరావు, కార్యదర్శి వై.ఈశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ ఎం.శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు ఐ సత్యనారాయణ, సిహెచ్ శంకర్రావు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి వైద్యులు సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగులకు 2డి ఎకో, జనరల్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. నరాలు, ఎముకలు, గుండె, గ్యాస్ట్రో, మధుమేహం వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు రౌతు రామమూర్తి, యూనిట్ అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, బొత్స సత్యనారాయణ, మక్క శ్రీరామమూర్తి, జిల్లా జనరల్ సెక్రెటరీ రెడ్డి కృష్ణమూర్తినాయుడు పోల సత్యనారాయణ, తవిటయ్య, మరిశర్ల కృష్ణమూర్తి, బొత్స రామారావు పాల్గొన్నారు.

## పంచపత్ర కషాయంతో చీడ పురుగుల నివారణ

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పంచతంత్ర కషాయం వల్ల చీడపురుగులను నివారించవచ్చునని మండల వ్యవసాయాధికారి కె.రవీంద్ర తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా శనివారం మండలంలోని వినాయక పల్లి గ్రామంలో ఆయన క్షేత్ర సందర్శన చేసి కాలి బాటలను పరిశీలించారు. పంచపత్ర కషాయాన్ని తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచ పత్ర కషాయం తయారీకి వేప, కానుగ, సీతాఫలం, జామ ఆకులను ఒక్కొక్కటి రెండు కేజీలు చొప్పున తీసుకుని 20 లీటర్ల నాటు ఆవు మూత్రంతో తయారు చేస్తారని ఈ కషాయం వల్ల పచ్చ పురుగు, గొంగళి పురుగులను నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎఎ రవిచంద్ర, ఐసిఆర్‌పిలు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు అవగాహన

ప్రజాశక్తి - డెంకాడ

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లుగా నమోదైన వారికి పోలీస్ స్టేషన్‌లో భోగాపురం సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లుగా పేర్లు ఉన్న వ్యక్తులు గ్రామాల్లో తగాదాలకు దూరంగా ఉండాలన్నారు. ఎటువంటి తగాదాలకూ వెళ్లకుండా మంచి ప్రవర్తనతో మెలగాలన్నారు. తగాదాలకు ముందుకు పోకుండా గ్రామాల్లో ఎటువంటి పరిణామాలు జరిగిన పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యతతో కూడిన విద్యను అందించాలి

ప్రజాశక్తి - వేపాడ

విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలని ఎంఇఒలు జి. జగదీశ్వరరావు, పి. బాలభాస్కరరావు సూచించారు. మండలంలో శనివారం సోంపురం, ఎన్‌కెఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా పెనుమత్స జయంతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కీర్తిశేషులు మాజీ మంత్రి పెనుమత్స సాంబ శివరాజు జయంతి వేడుకలు శనివారం మొయిద విజయ రాంపురంలో ఘనంగా నిర్వహించారు. ఆయన 91వ జయంతి వేడుకలను కుమారులు ఎమ్మెల్సీ సురేష్‌బాబు, పెనుమత్స సంతోష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్మృతి వనంలో పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కె.వి సూర్యనారాయణరాజు, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, నాయకులు రేగాన శ్రీనివాసరావు, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

## విధులు ఎప్పుడు నిర్వహిస్తారో..

ప్రజాశక్తి- బాడంగి

స్థానిక డివిజన్ పంచాయతీ రాజ్ శాఖ అధికారులు విధులు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని సిపిఎం నాయకులు సురేష్ ప్రశ్నించారు. ఎప్పుడు చూసినా సీనియర్ అసిస్టెంట్ తప్ప ఈ కార్యాలయంలో ఎవరూ ఉండరని అడిగారు. ఆయన శనివారం డివిజన్ పంచాయతీరాజ్ శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా సార్లు వినతులు ఇద్దామని వచ్చినా అధికారులు మాత్రం ఇక్కడ ఉండటం లేదన్నారు. ఎప్పుడు అడిగినా ఫీల్డ్ వర్క్‌లో ఉన్నారంటూ సమాధానం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆఫీసుకు డుమ్మా కొడుతూ సొంత పనులు చేసుకుంటున్న ఇటువంటి అధికారులపై వెంటనే పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మాజీ ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తెర్లీ శ్రీనివాసరావు తండ్రి సన్యాసినాయుడు అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శనివారం ఉదయం సన్యాసినాయుడు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాడంగి మండల కేంద్రానికి చెందిన మాజీ వాలంటీర్ భర్త రాజన చంద్రశేఖర్ ఆకస్మిక మరణం చెందిన విషయం తెలుసుకుని ఆయన భౌతిక కాయనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సువర్ణకు ఉత్తమ డాక్టర్ అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం

అవార్డు అందుకుంటున్న డాక్టర్ సువర్ణ

వృత్తిలో అంకిత భావంతో పనిచేసి, అందరి మన్నలను పొందిన తాళ్లపూడి సువర్ణ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ వైవి రమణ చేతులమీదుగా ఉత్తమ డాక్టర్ అవార్డును అందుకున్నారు. వృత్తిలో నిబద్ధత అంకిత భావంతో పనిచేసిన అధికారులకు, సిబ్బందికి ప్రభుత్వం ప్రతి ఏడాది ఉత్తమ అవార్డులను ప్రదానం చేస్తున్న విషయం తెలిసిందే. గజపతినగరం నియోజకవర్గంలో జివికె సంస్థలో వెటర్నరీ డాక్టర్‌గా పనిచేస్తున్న సువర్ణ అతితక్కువ కాలంలోనే ఉత్తమ అవార్డు అందుకోవడంతో ఆశాఖ అధికారులు, తోటి ఉద్యోగుల మన్ననలు పొందారు.

కొత్తవలస: నిరసన ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

రాజాం: మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రామ్మూర్తినాయుడు

నెల్లిమర్ల: ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

# హంతకులను కఠినంగా శిక్షించాలి

## జిల్లా అంతటా వైద్యుల నిరసన ర్యాలీలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రాణాలు పోసే డాక్టర్ల ప్రాణాలను తీయవద్దని బొబ్బిలి ఐఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు బి.కాశీనాయుడు, అక్కేనా దివాకర్ బాబు, సీనియర్ వైద్యులు జి.గోపీనాథ్, జి.శశిభూషణరావు కోరారు. కలకత్తాలో ట్రైనీ డాక్టర్ పై హత్యాచారానికి వ్యతిరేకంగా బొబ్బిలిలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది విధులు బహిష్కరించి శనివారం నిరసన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన తెలిపిన వైద్యులు, వైద్య సిబ్బంది ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహశీల్దార్ ఎం.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పని చేస్తున్న వైద్యులకు, వైద్య సిబ్బంది ప్రాణాలకు రక్షణ లేకపోవడం సిగ్గు చేటన్నారు. కలకత్తాలో ట్రైనీ వైద్యురాలపై అత్యాచారం చేసి హత్య చేయడం చూస్తే వైద్యులు ప్రాణాలకు ఎక్కడ రక్షణ ఉందని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి సిటింగ్ జడ్జి లేదా సీబీఐతో సమగ్ర దర్యాప్తు చేసి నిందుతులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరారు. అనంతరం డిఎస్‌పి, ఆర్‌డిఒ కార్యాలయాలకు వెళ్లి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రామ్ నరేశ్, పి.సునీల్ కుమార్, పి.రాకేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**శృంగవరపుకోట:** కలకత్తాలో డాక్టర్ పై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని శనివారం పట్టణంలోని ప్రైవేటు హాస్పిటల్స్ డాక్టర్లు, మెడికల్ సిబ్బంది దేవి కూడలి వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ అరుణకుమారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ త్రినాధరావు మాట్లాడుతూ కలకత్తాలో మహిళా డాక్టరు మోమితపై సాముహిక ఆత్యాచారం, హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. డాక్టర్స్‌పై భౌతిక దాడుల నివారణకు చట్టం తేవాలని డిమాండు చేస్తున్నామన్నారు. కలకత్తా మెడికల్ కళాశాల మహిళా డాక్టరుపై జరిగిన ఆత్యాచారం, హత్య కేసులో న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లు, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నెల్లిమర్ల:** కలకత్తా వైద్యురాలిపై అత్యాచారం హత్యచేసిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని సిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వినోద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సామాజిక ఆసుపత్రి వైద్య బృందం, స్టాఫ్ నర్సులు, సిబ్బంది

బొబ్బిలిలో నిరసన ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వైద్యులు మాట్లాడుతూ సమాజంలో భాగమై వైద్య సేవలు అందిస్తున్న వైద్యులపై ఇలాంటి హేయమైన దాడులు చేయడం సమంజసం కాదన్నారు. వైద్యురాలి ఘటనకు కారణమైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

**పూసపాటిరేగ:** ప్రాణాలు పోసే డాక్టర్లు ప్రాణాలు కాపాడాలని పూసపాటిరేగలో వైద్య సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. కలకత్తా విధుల్లో ఉన్న జూనియర్ డాక్టర్‌ని అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసిన ద్రోహులను కఠినంగా శిక్షించాలని, భాదిత మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ ప్రమీలదేవి ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో రాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు వేదమని, హెల్త్ సూపర్ వైజర్ నానమ్మ, ఆరోగ్య సహాయకులు ఆర్‌వి రమణ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌లు సింధూజ, అరుణ, సంతోషి, సృజన, ప్రసన్న, శిరీష, స్టాఫ్‌నర్స్ స్వాతి, ఎఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు, సూర్యోదయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు

**రామభద్రపురం:** ప్రాణాలు కాపాడే డాక్టర్ల ప్రాణాలకే రక్షణ లేదా? అని ప్రభుత్వాలను నిలదీస్తూ వైద్య సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సి నుంచి ఆర్‌టిసి బస్టాండు మీదుగా గాంధీ బొమ్మ జంక్షన్ వరకు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ శాంతి యుతంగా ర్యాలీ చేశారు. పిహెచ్‌సి వైద్యాధికారి దిలీప్ కుమార్ మాట్లాడుతూ కలకత్తాలో ట్రైనీ డాక్టర్ పై హత్యాచారానికి వ్యతిరేకంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన, సంఘీ బావం ప్రకటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శిరీష, రత్న దీపక్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**కొత్తవలస:** కలకత్తాలో జూనియర్ డాక్టర్ పై హత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ కొత్తవలసలో ఐఎంఎ ఆధ్వర్యంలో వైద్యాధికారులు శనివారం ధర్నా చేశారు. తక్షణం దేశంలోని మహిళలకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో కొత్తవలస వైద్యులు టి. రమణయ్య, ఆర్.దిలీప్ కుమార్, టి. సుబ్బారావు, పి. వెంకటేశ్వరరావు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

**రాజాం:** కలకత్తాలో డాక్టర్ మోహితపై జరిగిన అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామమూర్తి నాయుడు, ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. డ్యూటీ డాక్టర్ మోహిత డ్యూటీలో ఉండగా సామూహికంగా అత్యాచారం చేసి, అతి ఘోరంగా చంపిన దుర్ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాలు పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది వైద్య విద్యార్థినిలు ఆందోళన చేపట్టారు. రాజాం ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ ర్యాలీ, అనంతరం మానవహారం నిర్వహించారు.

రామభద్రపురంలో ధర్నా చేస్తున్న వైద్యులు

ఎస్‌కోట : నిరసన ర్యాలీ చేస్తున్న వైద్య బృందం, సిబ్బంది

పూసపాటిరేగ: నినాదాలు చేస్తూ ర్యాలీ చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

## ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లపై ఫిర్యాదు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని వల్లూరు, పారసాం గ్రామాలకు చెందిన ఉపాధిహామీ క్షేత్ర సహాయకులను తొలగించాలని ఆయా గ్రామాలకు చెందిన వేతనదారులు పిడీ ఉమా పరమేశ్వరికి ఫిర్యాదు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా వివిధ గ్రామాల్లో బయటపడిన విషయాలను రిసోర్స్ పర్సన్లు వెల్లడించారు. ఏ గ్రామంలోనూ దరఖాస్తు చేసుకున్న వెంటనే జాబ్ కార్డులు మంజూరు చెయ్యడం లేదని పేర్కొన్నారు. ఎక్కువగా చెరువు పనులు మాత్రమే చేపట్టారని చెప్పారు. వల్లూరు గ్రామానికి సంబంధించి ఆరు నెలల క్రితం అడిగిన వారికి కూడా జాబ్ కార్డులు అందజేయలేదని స్థానికులు ఫిర్యాదు చేసినట్లు రిసోర్స్ పర్సన్ వెల్లడించారు. ఫీల్డ్ అసిస్టెంట్ కు బదులు ఆమె భర్త పనులు చేయిస్తున్నారని ఫిర్యాదు అందినట్లు చెప్పారు. ఇదే విషయమై గ్రామస్తులు పీడీకి ఫిర్యాదు చేశారు. పారసాం గ్రామానికి చెందిన వేతనదారులు కూడా స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని కోరారు. స్పందించిన పీడీ వేతనదారుల ఫిర్యాదుపై విచారణ జరిపిస్తానని ప్రకటించారు. ఉపాధిహామీ ద్వారా కేవలం చెరువు పనులు మాత్రమే గాకుండా రైతులకు ఉప యోగపడే పనులు చేపట్టాలని సూచించారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాములనాయుడు, టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, ఈవోపీఆర్డీ సింహాద్రి, ఏపీఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

### వాడీవేడిగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

పీడీకి ఫిర్యాదు చేస్తున్న వల్లూరు గ్రామస్తులు

## పోలీసుల సమక్షంలో ఎస్ఎంసి ఎన్నికలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని చిన్నశిర్లాం, సోమరాజుపేట, మునకల వలస, తునివాడ గ్రామాల్లో వాయిదా పడిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు శనివారం నిర్వహించారు. చిన్నశిర్లాం పాఠశాలకు సంబంధించి వైసిపి, టిడిపిల మధ్య ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఎస్ఐ శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో ఒకటి నుంచి 7వ తరగతి వరకు ఎస్ఎంసి ఎన్నికలు టిడిపి వర్గీయులకు సంబంధించి డైరెక్టర్లు ఎన్నికయ్యారు. 8వ తరగతి సంబంధించి కోరం లేక ఎన్నిక వాయిదా పడింది. పూర్తిస్థాయిలో ఎన్నికలు జరగకపోవడంతో చైర్మన్, ఉప చైర్మన్ ఎన్నిక కూడా వాయిదా పడినట్లు ఎన్నికల అధికారి రామినాయుడు తెలిపారు. సోమరాజుపేట పాఠశాలలో హెచ్ఎం అచ్యుతరావు ఆధ్వర్యంలో ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహించగా, చైర్మన్‌గా బూడి కుమారి, వైస్ చైర్మన్‌గా బూడి ఉషారాణి ఎన్నికయ్యారు. మునకల వలసలు పాఠశాలలో హెచ్ఎం తాతనాయుడు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో లావేటి లక్ష్మి, పొట్నూరు జ్యోతి ఎన్నికయ్యారు. తునివాడ పాఠశాలలో పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా, చైర్మన్‌గా రుంకు సుజాత, గౌరీశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో ప్రమాణస్వీకారం చేశారు.

### మళ్లీ ఆగిన పాఠశాల ఎన్నికలు

**చీపురుపల్లి:** మండలంలో స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీలకు సంబంధించి మూడు పాఠశాలలలో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ నెల 8వ తేదీన ఎస్ఎంసి ఎన్నికలు జరగగా చీపురుపల్లి పట్టణంలో గల బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలతో పాటు మండలంలో రామలింగాపురం, ఆర్థివలస, గుణిదాం పాఠశాలలో ఎన్నికలు నిలిచిపోయాయి. కాగా తిరిగి ఈ నెల 17న ఆయా పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ గవిడి సురేష్, వైస్ చైర్మన్ గా చిప్పాడ సూరమ్మ, రామలింగాపురం పాఠశాల చైర్మన్ గా ఇప్పిలి ఉమ, వైస్ చైర్మన్ గా యడ్ల అప్పలనాయుడు, ఆర్థివలస పాఠశాల చైర్మన్ గా ఆకుల మహాలక్ష్మి నాయుడు, వైస్ చైర్మన్ గా లెంక అపర్ణ ఎన్నికయ్యారు. కాగా బాలికల ఉన్నత పాఠశాల, గుణిదాం పాఠశాల కమిటీ ఎన్నికలు వాయిదా పడ్డాయి.

## బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే కోళ్ల

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ఆర్‌టిసి డిపో ఆవరణంలో ఎస్‌కోట - విశాఖపట్నం ఆల్ట్రా పల్లె వెలుగు నూతన బస్సును శనివారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన బస్సు సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నష్టాల బాటలో ఉన్న ఆర్‌టిసి విభాగం మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్వవైభవం తీసుకొచ్చే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటారని చెప్పారు. రాబోయే రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, భీశెట్టి అరుణ, క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు, మాజీ ఎంపిటిసిలు కనిశెట్టి ఈశ్వరరావు, దుల్ల వెంకటరావు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు పొట్నూరు సాయి రాం, బోనంగి జ్యోతి, సొంగ కృష్ణ, హైటెక్ సురేష్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

## పశువులకు టీకా వేయించాలి

ప్రజాశక్తి- గంట్యాడ

ప్రతి రైతు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని గంట్యాడ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రెడ్డి కృష్ణ అన్నారు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ నుంచి సెప్టెంబరు 19వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకాలు వేయాలన్నారు. మండలంలోని మూడు టీమ్‌లుగా ఏర్పడి సిబ్బంది గ్రామాల్లో పశువులకు ఈ టీకాలు వేస్తారన్నారు. ఈ వ్యాధి వ్యాపించిన పశువులకు నోటిలోని, కాళ్ళ డెక్కల మధ్య పుండ్లు ఏర్పడి నడవలేక, మేత తినలేక నోటి నుండి సొంగ కారుతుందన్నారు. దీని వల్ల పశువులు నీరసంగా తయారై పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. వీటి నివారణకే ఈ టీకాలు వేస్తున్నామని చెప్పారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## విద్యార్థినులకు రక్త పరీక్షలు

**వంగర:** స్థానిక కెజిబివి పాఠశాల విద్యార్థినులకు ప్రిన్సిపాల్ బి. రోహిణి సమక్షంలో ఎఎన్ఎం విశాలాక్షి శనివారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యం పట్ల విద్యార్థినిలు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది మరియమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**భోగాపురం:** మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని భోగాపురం సిఐ ఎ.రవికుమార్ అన్నారు. భోగాపురం గ్రామంలోని ఎస్‌కెఎడిఎం జూనియర్ కళాశాల, ముంజేరు గ్రామస్తులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, లేదంటే జీవితాలు నాశనం అవుతాయని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరస్తుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పిడుగు వెంకటసత్యం, జనసేన నాయకులు పిడుగు జోగారావు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ట్రెంచుల ఏర్పాటు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి పంచాయతీ పరిధి బొడ్డవలస గ్రామం వద్ద గత 15 రోజులుగా ఇసుక అక్రమ రవాణా జరగడంతో ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ ఈ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బొడ్డవలస నాగావళి నదికి సమీప రహదారికి ట్రెంచ్‌లు ఏర్పాటు చేసి చెక్ పెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని, ట్రెంచ్‌లు ఎవరైనా మూసివేసినా వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.

### ట్రెంచ్‌లు నిలిచేనా?

గతంలో బొడ్డవలస వద్ద ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అధికారులు ఎన్నోసార్లు ట్రెంచులు ఏర్పాటు చేసినా వాటిని కప్పి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ట్రెంచులు ఎంతవరకు ఉంటాయో అనేది ఆసక్తికర అంశం. వాస్తవంగా విఆర్‌ఒ, పంచాయతీ కార్యదర్శి, విఆర్‌ఎలను ఇసుక అక్రమ రవాణా వద్ద డ్యూటీలు వేస్తే కొంతవరకు ఇసుక అక్రమ రవాణా అరికట్ట వచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. అధికారులు ఆ విధంగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

జెసిబితో ట్రెంచ్‌ను తవ్విస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

## మొక్కలు నాటిన చిరంజీవి యువత

**విజయనగరం టౌన్ :** జిల్లా చిరంజీవి యువత, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ మరియు అంజనీ పుత్ర చిరంజీవి బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా శనివారం వైస్సార్ నగర్ సరస్వతి నగర పాలక ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా చిరంజీవి యువత ఉపాధ్యక్షులు పిడుగు సతీష్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు మాట్లాడుతూ పర్యావరణానికి అందరూ నడుం బిగించాలనే ఉద్దేశంతో మెగాభిమానులకు, అఖిలభారత చిరంజీవి యువత పిలుపునిచ్చిందని. అందులో భాగంగా మొక్కలు నాటమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి లోపింటి కల్యాణ్, హుస్సేన్ ఖాన్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాలేజీ విద్యార్థినిలకు బ్యాగులు పంపిణీ

**శృంగవరపుకోట:** మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు శనివారం బ్యాగులు పంపిణీ చేసినట్లు హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు తెలిపారు. కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 16 మంది విద్యార్థినిలకు, ద్వితీయ సంవత్సరం 11 మంది విద్యార్థినులకు ప్రభుత్వం అందించే స్టూడెంట్ కిట్‌లో భాగంగా గతవారం విద్యార్థినులకు ఉచితంగా ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలను, నోటు పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. ఇప్పుడు ప్రభుత్వం బ్యాగులను అందజేసిందని వాటిని విద్యార్థినులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు పొట్నూరు శివాజీ, రహీం షేక్ లాల్, తమ్మినాన రాజేష్, ఎస్‌విఎస్‌ఎన్ మూర్తి (సతీష్ మాస్టర్), అరసాడ సురేంద్రనాథ్, చింతాడ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

### మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కొత్తవలస

విశాఖ-అరకు ప్రధాన రహదారిలో మండలంలోని మంగళపాలెం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి 1గంట సమయంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా మరో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు కొత్తవలస సిఐ షణ్ముఖరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస గ్రామానికి చెందిన నలుగురు యువకులు కొత్తవలస నుంచి పెందుర్తి వైపు పెళ్లి పనుల నిమిత్తం కారులో వెళ్తుండగా అదే సమయంలో పెందుర్తి నుంచి కొత్తవలస వైపు వస్తున్న లారీ కారును డీకొట్టింది. దీంతో కార్లో ఉన్న నలుగురు యువకుల్లో ఒక యువకుడు మేలాస్త్రి నాయుడు (23) ఘటనాస్థలంలో అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు యువకులు బూసాల షణ్ముఖ, గొరపల్లి లోకేష్, పెంటకోట షణ్ముఖలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద ఘటనపై సమాచారం తెలుసుకున్న వెంటనే హుటాహుటిన సిఐ షణ్ముఖరావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఘటనపై మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.